

బీసీలను మభ్యపెడుతున్న బాబు

కుప్పంలో సుమారు 40 ఏళ్లుగా బీసీలను చంద్రబాబు మభ్యపెడుతున్నారని ఎమ్మెల్సీ భరత్ ఆరోపించారు. - 8లో



జిల్లా స్థాయి క్రికెట్‌కు పూతలపట్టు

నియోజకవర్గస్థాయి క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించి పూతలపట్టు జట్టు జిల్లాస్థాయికి ఎంపికైంది. - 8లో



వేగంగా 'స్పందన' భవన నిర్మాణం

చిత్తూరు కలెక్టరేట్ ప్రాంగణంలో స్పందన భవన నిర్మాణం వేగంగా పూర్తి చేస్తున్నామని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

జూనియర్ సివిల్ జడ్జిగా రోహిత్ ఎంపిక



బంగారుపాళెం: మండలంలోని ముంగరమగుడుకు చెందిన మత్యం రోహిత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై య్యారు. గ్రామానికి చెందిన దేవానంద్ కుమారుడు రోహిత్ 2022లో తిరుపతి అంబేడ్కర్ గ్లోబల్ లా ఇన్సిట్యూట్‌లో లా పూర్తిచేసి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఏపీ హైకోర్టు 2023లో నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల ఫలితాలను శుక్రవారం విడుదల చేయగా ఓపెన్ కేటగిరిలో రోహిత్ ఎంపికయ్యారు. దీనిపై కుటుంబీకులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రేపటి వరకు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్:ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తత్కాల్ విధానంలో 29వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు డీవీఈఓ సయ్యద్ మౌలా తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థులు ఏదైనా కారణాలతో ఫీజు చెల్లించకుంటే ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. రూ.3వేల అపరాధ రుసుముతో ఆయా కళాశాలల ద్వారా పరీక్ష ఫీజు చెల్లించవచ్చని వెల్లడించారు.

ఎన్‌వైఎస్‌కే జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా మస్తాన్



చిత్తూరు కలెక్టరేట్ : నెహ్రూ యువకేంద్ర సంఘటన్ (ఎన్‌వైఎస్‌కే) జిల్లా అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా షేక్ రెడ్డి మస్తాన్ నియమితులయ్యారు. శనివారం ఈ మేరకు ఎన్‌వైఎస్‌కే డైరెక్టర్ జనరల్ నితీష్‌కుమార్ మిశ్రా ఉత్తర్వులు జారీ చేశారు. మస్తాన్ మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. నియామకానికి సహకరించిన బీజేపీ నేతలు పనతల సురేష్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.


నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు అవకాశం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని విద్యుత్ వినియోగదారులు ఆదివారం సైతం బిల్లులు చెల్లించే వెసులుబాటు కల్పించినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఎస్టీయూ వార్షిక కౌన్సిల్ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్:చిత్తూరులోని డీఈఓ కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఎస్టీయూ వార్షిక కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవరాజులురెడ్డి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు, సీపీఎస్, జీపీఎస్ రద్దు, తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు.

గణనాథుని సేవలో జస్టిస్ సునీల్ చౌదరి



ఆలయంలో జస్టిస్ సునీల్ చౌదరి, కుటుంబసభ్యులు

కాణిపాకం (యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర వినియోగదారుల ఫిర్యాదులు, పరిష్కారాల కమిషన్ చైర్మన్ జస్టిస్ సునీల్ చౌదరి శనివారం సేవించుకున్నారు. ఉదయం ఆయన కుటుంబ సమేతంగా ఆలయం వద్దకు విచ్చేయగా ఏఈఓ ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

సత్యవేడు.. ఫ్యాన్ స్పీడు!



తిరుపతిలో జరిగిన సత్యవేడు నియోజకవర్గ పార్టీ శ్రేణుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ స్పీడు పెంచింది. అందరినీ ఒకే తాటిపైకి తెచ్చి ఆత్మీయ సమ్మేళనం పేరుతో సమావేశాన్ని ఏర్పాటు చేసింది. వచ్చే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించింది. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని నిర్ణయించింది. తద్వారా గతంకంటే అత్యధిక మెజారిటీతో పార్టీ అభ్యర్థిని గెలిపించాలని దిశానిర్దేశం చేసింది.

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించండి
- చంద్రబాబు మోసపూరిత హామీలను తిప్పికొట్టండి
- కుప్పంలోనూ చంద్రబాబు ఓటమి తప్పదు
- రెండు నియోజకవర్గాల్లో పోటీకి సిద్ధమవుతున్న చంద్రబాబు
- సత్యవేడు నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో పార్టీ శ్రేణులకు మంత్రి పెద్దిరెడ్డి దిశానిర్దేశం

వరదయ్యపాళెం: జిల్లాలో సత్యవేడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీకి కంచుకోటగా ఉందని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. అందుకు అనుగుణంగా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు సంసిద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు తిరుపతిలో జరిగిన సత్యవేడు నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణులు ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి దిశానిర్దేశం చేశారు. మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు చేస్తున్న మోసపూరిత హామీలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేస్తుంటే చంద్రబాబునాయుడు తప్పుడు ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుయుక్తులు పన్నారని ధ్వజమెత్తారు. ఇప్పుడు రెట్టింపు పథకాలు అమలు చేస్తానంటూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు బాబు సిద్ధమయ్యారని, వీటిని అందరూ గమనించాలని ఆయన సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబును ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఓటరు నాడిని ముందుగానే పసిగట్టిన ఆయన ఓటమిని అంగీకరించి రెండుచోట్ల పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. వెనుకబడిన సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపిస్తే అభివృద్ధి కొనసాగుతుందన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ ఆదరించాలని మంత్రి పిలుపునిచ్చారు. సత్యవేడు నియోజకవర్గ పార్టీ శ్రేణులు మొదటి నుంచి తనతో నడుస్తున్నారని, తాను మద్దతు తెలిపిన ప్రతి అభ్యర్థికీ మీరు అండగా నిలిచారని, అదే స్ఫూర్తితో ఈ సారి ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో తాడిపత్రి నియోజకవర్గ పరిశీలకులు బీరేంద్రవర్మ, సురుటుపల్లి చైర్మన్ ఏఎంసీ బాలాజీరెడ్డి, మండల పార్టీ కన్వీనర్లు నాయుడు దయాకర్‌రెడ్డి (వరదయ్యపాళెం), సుశీల్‌కుమార్‌రెడ్డి (సత్యవేడు), అపరంజిరాజు (నాగలాపురం), సారకాయలు (నారాయణవనం), ఆరణి విద్యానాథరెడ్డి (బీఎన్‌కండ్రిగ), గవర్ల కృష్ణయ్య (కేవీబీపురం), వెంకటచలపతిరాజు (పిచ్చాటూరు), ఎంపీపీలు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

పవన్ రాజకీయాలకు పనికిరాడు

స్థిరమైన మనస్తత్వం లేని వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే, ఆ వ్యక్తి పవన్ కళ్యాణేనని టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు పోకల అశోక్‌కుమార్ విమర్శించాడు. సినిమాలలో ఆయన నటనకు పనికొస్తాడే తప్ప రాజకీయాలకు పనికిరాడని తేల్చిచెప్పాడు. ఇలాంటి వ్యక్తులు ప్రజల మన్ననలు పొందడం కష్ట సాధ్యమన్నారు. ఒకసారి టీడీపీ అంటాడు.. మరోసారి బీజేపీ అంటాడు..ఇంకోసారి ఎవరితో పొత్తు ఉండదని, ఇలా పూటకో నిర్ణయం తీసుకునే వ్యక్తికి ప్రజాక్షేత్రంలో ఆదరణ ఉండదన్నారు.



సమావేశానికి హాజరైన సత్యవేడు నియోజకవర్గ పార్టీ శ్రేణులు

పెద్దల నిర్ణయమే శిరోధార్యం

పార్టీ నిర్ణయం మేరకు ముఖ్యమంత్రి జగనన్న, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్ణయం మేరకు సత్యవేడు సమన్వయకర్తగా నియమితులైన మద్దెల గురుమూర్తిని ఆదరించాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు, నారాయణవనం జెడ్పీటీసీ కోనేటి సుమన్‌కుమార్ కోరారు. తన తండ్రి కోనేటి ఆదిమూలం అనారోగ్య కారణాల రీత్యా తిరుపతిలో జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీకి హాజరు కాలేకపోయారని వివరించారు. పార్టీ పెద్దల నిర్ణయం మేరకు తిరుపతి పార్లమెంటు సమన్వయకర్తగా నియమితులైన కోనేటి ఆదిమూలంను అందరూ సమన్వయంతో ఆదరించాలని కోరారు.



ఎంపీ గురుమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుమన్

అందుబాటులో ఉంటా.. ఆదరించండి

ముఖ్యమంత్రి జగనన్న ఆశీస్సులతో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనలతో సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన తాను ఇకపై ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతానని ఎంపీ గురుమూర్తి పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చారు. తిరుపతి పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్ వేదికగా తిరుపతి పార్లమెంటు ఉపఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా తనను అప్పట్లో ప్రకటించారని గుర్తుచేశారు. తిరుపతి పార్లమెంట్ చరిత్రలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు పరిష్కారానికి నోచుకోని సమస్యలపై పార్లమెంటులో తన వాణి వినిపించి పరిష్కారం చూపగలిగానని తెలిపారు. అదే స్ఫూర్తితో ఎంతో వెనుకబడిన సత్యవేడు నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృది చేస్తామని చెప్పారు. రానున్న నెలరోజుల వ్యవధిలో నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే తన నిధుల ద్వారా నియోజకవర్గంలోని పలు రోడ్లకు రూ.1.40 కోట్లు మంజూరు చేశానని తెలిపారు. త్వరలో ఆ పనులు పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో పార్టీ శ్రేణులందరూ ఒక్క తాటిపై వచ్చి జగనన్న ఆశయమైన వైనాట్ 175 ఆశయాన్ని నిజం చేయాలని ఆయన కార్యకర్తలు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

అతివల సాధికారతకు 'ఆసరా'



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- సోనియా, చంద్రబాబు వదిలిన బాణం షర్మిల
- పొదుపు సంఘాలకు చెక్కుల పంపిణీలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : అతివల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. శనివారం కార్వేటినగరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఆసరా ఉత్సవాలు నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పొదుపు మహిళలకు ఇచ్చిన హామీ నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. 45 ఏళ్లు నిండిన మహిళలకు ఏటా రూ.18,750 అందిస్తున్నారని వెల్లడించారు. విద్య, వైద్య రంగాలను విప్లవాత్మకంగా అభివృద్ధి చేశారన్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు మొత్తం 175 సీట్లు గెలిపించి కానుకగా అందించాలని పిలుపునిచ్చారు. పేదల అభ్యున్నతిని జీర్ణించుకోలేని పెత్తందార్లు, ఎల్లోమీడియా అసత్య కథనాలతో విషం కక్కుతున్నారని మండిపడ్డారు. అనంతరం 946 పొదుప సంఘాలకు చెందిన 9,156 సభ్యులకు రూ.9కోట్ల 40 లక్షల 29 వేల మెగా చెక్కు అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పొదుపు మహిళలు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ లత, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సర్పంచ్ ధనంజయ వర్మ, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, కో–ఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి, తహసీల్దార్ రవిరాజు, ఏపీఎం విజయకుమార్ పాల్గొన్నారు.

మహిళా పక్షపాతి సీఎం వైఎస్ జగన్

శ్రీరంగరాజపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న మహిళా పక్షపాతి అని, అందుకే అన్ని పథకాలను ఆడపడుచులకే అంకితం చేస్తున్నారని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. ఎస్ఆర్ పురంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా పథకం చెక్కు పంపిణీలో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విష ప్రచారం చేసేందుకు ఎల్లోమీడియా, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఏకమయ్యారని ఆరోపించారు. అనంతరం మండలంలోని 814 పొదుపు సంఘాలకు చెందిన 7,615 మంది సభ్యులకు రూ.29.91 కోట్ల మెగా చెక్కు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నూరాజు, ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీఎం రోజా, పార్టీ మండల కన్వీనర్ మణి, సర్పంచ్ హరిత, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, నాయకులు జనార్దన్, కుప్పయ్య, సూరిరెడ్డి, విజయాబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు కొమ్ము కాయడం దారుణం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డిపై కేసు పెట్టిన కాంగ్రెస్‌కు షర్మిల కొమ్ముకాయడం దారుణమని డిప్యూటీ సీఎం నారాయణస్వామి విమర్శించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సోనియా, చంద్రబాబు వదిలిన భాణం షర్మిల అని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చి, ఇప్పుడు అదే పార్టీకి అండగా నిలవ డం న్యాయమేనా అని ప్రశ్నించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని స్పష్టం చేశారు.

యువత భవితకు 'ఆడుదాం'



వాలీబాల్ ఆడుతున్న మంత్రి రోజా

- జగనన్న ఆశీస్సులతో 3 లక్షల మ్యాచ్‌లు
- మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు: యువతలో క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచి ఉన్నత భవిష్యత్ అందించేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నట్లు మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శనివారం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి పోటీలను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ జగనన్న ఆశీస్సులతో ఇప్పటి వరకు 15,004 సచివాలయాల పరిధిలో పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. వివిధ స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల మ్యాచ్‌లు జరిపిస్తున్నట్లు వివరించారు. ఈ పోటీల ద్వారా మట్టిలోని మాణిక్యాలను వెలికి తీస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని స్పష్టం చేశారు. యువత క్రీడలపై ఉత్సాహంగా ఉన్నారని, గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. లోపాలను గుర్తించి, వాటిని సరిచేసుకొని మళ్లీ పోటీపడి విజయం సాధించాలని పిలుపునిచ్చారు. విజేతలకు తన తరఫున ప్రత్యేక బహుమతులు అందిస్తానని తెలిపారు. అనంతరం నిండ్ర, నగరి జట్ల మధ్య వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. వారితో కొద్దిసేపు వాలీబాల్ ఆడి అందరిలో జోష్ పెంచారు. కార్యక్రమంలో నగరి ఇన్‌చార్జి ఆర్డీఓ భవాని, ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ మురళీకృష్ణ, మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ మాహీన్ తదితరులు పాల్గొన్నారు.



మహిళల కబడ్డీ జట్టుతో మంత్రి రోజా

బీసీలను మభ్యపెడుతున్న బాబు



పార్టీలో చేరినవారితో ఎమ్మెల్సీ భరత్



మెగా చెక్కు పంపిణీ చేస్తున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

కుప్పం : సుమారు 40 ఏళ్లుగా బీసీలను చంద్రబాబు మభ్యపెడుతున్నారని ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. శనివారం కుప్పంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా పథకం చెక్కు పంపిణీలో ఎంపీ రెడ్డెప్పతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ బీసీలు అధికంగా ఉన్న కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు పాగా వేసి ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎమ్మెల్యేలుగా, సమితి ప్రెసిడెంట్లుగా పనిచేసిన బీసీలను నిర్దాక్షిణ్యంగా అణగదొక్కేశారని మండిపడ్డారు. బలహీన వర్గాలకు ఏం న్యాయం చేశారని ఇప్పుడు జై బీసీ నినాదం అందుకున్నారని విమర్శించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన మా తండ్రి చంద్రమౌళి ఇప్పటికి రెండు సార్లు పోటీ చేసి ఓడిపోయారని, అయితే తమను నమ్మి 70 వేల మంది ఓట్లు వేశారని వివరించారు. నమ్మిన వారి అండగా నిలిచేందుకే చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని తెలిపారు. ముఖ్యమంత్రిని దెబ్బదీసేందుకు దుష్టశక్తులన్నీ ఏకమవుతున్నాయని, చివరకు షర్మిలను కూడా రెచ్చగొడుతున్నారన్నారు. ఎవరెన్ని పన్నాగాలు పన్నినా జగనన్న సారథ్యంలో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని స్పష్టం చేశారు. అనంతరం ఆసరా మెగా చెక్కును లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుధీర్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మొగసాల రెడ్డెప్ప పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ శ్రేణులు

రామకుప్పం: పంద్యాలమడుగు పంచాయతీ పల్లికుప్పంలో టీడీపీకి చెందిన 10 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం ఈ మేరకు ఎమ్మెల్సీ భరత్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలోకి వచ్చినట్లు తెలిపారు. కుప్పానికి హంద్రీ–నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలను తీసుకువచ్చిన వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు కృషి చేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో నాగరాజు, జ్యోతి, జానకిరామ్, రోజా, భవాని, శేఖర్, గీతా, కుమారియమ్మ, మహేష్ ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్ శ్వేత, ఎంపీటీసీ సభ్యులు జయమ్మ, పార్టీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, యువత అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న

పూతలపట్టు: బాల్య వివాహాలు నేరమని, ఎవరైనా ఇందుకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ట్రైనీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న స్పష్టం చేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుమారి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ బాల్యవివాహాలు నాగరికత కాదని, దేశం ఇంతలా అభివృద్ధి చెందుతున్నా ఇప్పటికీ ఇలాంటివి జరగడం బాధాకరమన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఎక్కడైనా మీ దృష్టికి వస్తే వెంటనే శిశు సంక్షేమశాఖ, తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీసుల్లో ఎవరో ఒకరికి సమాచారం అందించాలని కోరారు. ప్రభుత్వం సేవలను ప్రజల ముంగిటకు తీసుకువచ్చేందుకే సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ సచివాలయ సిబ్బంది సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ తమ గ్రామాల్లోని సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించాలని ట్రైనీ కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ గౌరి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు దొరస్వామిరెడ్డి, జయచంద్రారెడ్డి, డీటీ హిమగిరి పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రికెట్‌కు పూతలపట్టు జట్టు



పూతలపట్టు జట్టుకు ట్రోఫీ అందిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండలంలోని పోలవరం మైదానంలో శనివారం ఆడుదాం ఆంధ్ర కింద నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో యాదమరి జట్టుపై పూతలపట్టు జట్టు విజయం సాధించి జిల్లాస్థాయికి చేరింది. యాదమరి జట్టు 76 పరుగులు చేయగా, పూతలపట్టు జట్టు లక్ష్యాన్ని ఛేదించింది. ఈ క్రమంలోనే పూతలపట్టు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఖోఖో ఫైనల్స్ నిర్వహించారు. పురుషుల విభాగానికి సంబంధించి ఐరాల, యాదమరి, పూతలపట్టు జట్లు తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. మహిళల విభాగంలో యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల జట్లు తొలి మూడు స్థానాలు దక్కించుకున్నాయి. విజేతలకు అధికారులు, ప్రజాప్రతినిధులు ట్రోఫీలు బహూకరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గౌరి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ మాసిలామణి, స్థానిక నేత షణ్ముగం, పీడీలు కృష్ణ, ఢిల్లీరాణి, ఏకాంత, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓర్వలేకే అసత్య ఆరోపణలు



వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తుంటే ఓర్వలేకే చంద్రబాబు అసత్య ఆరోపణలతో బురదజల్లేందుకు యత్నిస్తున్నారని ఎంపీ రెడ్డెప్ప మండిపడ్డారు. శనివారం బైరెడ్డిపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజకీయాల నుంచి చంద్రబాబును శాశ్వతంగా సాగనంపాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటి వరకు 1.40 లక్షలకు పైగా సచివాలయ ఉద్యోగాలు, వైద్యరంగంలో 52 వేలు, ఏపీపీఎస్సీ ద్వారా 3వేల ఉద్యోగాలు కల్పించిందని వెల్లడించారు. ముఖ్యమంత్రి జగనన్న రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కాలేజీలకు శంకుస్థాపన చేశారని, ఇప్పటికే 9 కళాశాలలను ప్రారంభించారని తెలిపారు. టీడీపీ హయాంలో కేవలం 30 లక్షల మందికి మాత్రమే సామాజిక పింఛన్లు అందేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 64 లక్షల మందికి పెన్షన్ అందిస్తున్నామని వివరించారు. నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలన కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దామని స్పష్టం చేశారు. చంద్రబాబుకు మళ్లీ గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, సర్పంచులు రాజప్ప, వెంకటేష్, వైస్ సర్పంచ్ తబ్రాజ్, నేతలు కేశవులు, అమరనాథరెడ్డి, లక్ష్మీనారాయణ, చలపతి పాల్గొన్నారు.

వేగంగా 'స్పందన' భవన నిర్మాణం

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్మిస్తున్న స్పందన భవనం నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఈ మేరకు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సీఈఓ మాట్లాడుతూ త్వరితగతిన పనులను పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. త్వరలోనే భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

క్లుప్తంగా

మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

చంద్రగిరి: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ చంద్రగిరిలో ఫిబ్రవరి 1 (గురువారం) నుంచి 30 రోజుల పాటు మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ పీ.సురేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉండి ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతానికి చెందిన 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన నిరుద్యోగ మహిళలు శిక్షణకు అర్హులని తెలిపారు. కనీస విద్యార్హత 10వ తరగతి చదివి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి చార్జీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువ పత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాసుపోర్టు సైజు ఫొటోలతో సంస్థకి వచ్చి పేర్లు నమోదుచేసుకోవాలని సూచించారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, 11-48 ద్వారకానగర్ (రాయల్ విక్టరీ స్కూల్ దగ్గర) కొత్తపేట, చంద్రగిరి. ఫోన్ నం.79896 80587, 94949 51289, 63017 17672లో సంప్రదించాలని కోరారు.

హోంగార్డు సల్మాకు పరామర్శ



సల్మాతో మాట్లాడుతున్న అధికారులు

చిత్తూరు అర్బన్: ఇంటి తగాదాల కారణంగా మరిది చేతిలో గాయపడి చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హోంగార్డు సల్మాను ఉన్నతాధికారులు పరామర్శించారు. శనివారం ఈ మేరకు కర్నూల్ రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్, సౌత్ రేంజ్ హోంగార్డు డీఎస్పీ చిరంజీవి, చిత్తూరు హోంగార్డు ఆర్‌ఐ భాస్కర్ తదితరులు ఆస్పత్రికి వెళ్లి సల్మా ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టూటౌన్ సీఐ ఉలసయ్యను కేసు పూర్వపరాలపై ఆరా తీశారు. గాయపడ్డ సల్మాకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలకు కమిటీలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ జిల్లా అనుబంధ విభాగాల కమిటీలను శనివారం ప్రకటించారు. జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడిగా చిత్తూరుకు చెందిన సయ్యద్ సర్దార్, ఉపాధ్యక్షులుగా కుప్పం, పుంగనూరులకు చెందిన అర్షత్‌హుస్సేన్, కరీముల్లాకు స్థానం కల్పించారు. ఈ క్రమంలోనే జిల్లా పంచాయతీరాజ్ విభాగానికి పూతలపట్టుకు చెందిన కె.ప్రతాప్ రెడ్డిని అధ్యక్షుడిగా నియమించారు. అలాగే జిల్లాలోని పలు నియోజకవర్గాలకు చెందిన వారికి కమిటీల్లో అవకాశమిచ్చారు.

వివిధ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : వివిధ కోర్సుల్లో నాలుగు నెలల పాటు ఉచిత శిక్షణ పొందేందుకు అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజనల్ కో–ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో డీడీయుజీకేవై పథకంలో సీడప్ సౌజన్యంతో ఉన్నతి స్కీం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకంలో వంద పనిదినాలు పూర్తి అయిన కుటుంబాలకు చెందిన 18 నుంచి 32 ఏళ్ల యువతకు శిక్షణ అందించనున్నట్లు వివరించారు. ఎంపికైన వారికి కంప్యూటర్ హార్డ్‌వేర్, హెల్త్ కేర్ రంగంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఐటీలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సు, బేసిక్ కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనం, యూనిఫామ్ అందించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ తోపాటు ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 90630 82227, 9966448807 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వర్క్‌షాపులతోనే యువ ఇంజినీర్లకు ప్రోత్సాహం



సమావేశంలో మాట్లాడుతున్న వృత్తి నిపుణులు

నారాయణవనం: వృత్తివిద్యా కోర్సుల్లో వర్క్‌షాపుల నిర్వహణతో యువ ఇంజినీర్లకు ప్రోత్సాహం లభిస్తుందని పలువురు పేర్కొన్నారు. సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో డీప్ లెర్నింగ్(స్కిల్ అడ్వాన్స్‌డ్ కోర్స్)పై ఐదు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. సీఎస్ఈ, సీఎస్ఎం, సీఏఐ, సీఎస్ఐటీ నాలుగో సంవత్సరం విద్యార్థులకు డీప్ లెర్నింగ్‌పై ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో పని చేస్తున్న దాసరి అర్జున్‌రెడ్డి, పురం చంద్రశేఖర్ శిక్షణ ఇచ్చారు. వక్తలు మాట్లాడుతూ ఇన్నోవేటివ్ వర్క్‌షాప్‌ల నిర్వహణతో ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఇంజినీరింగ్ విద్యార్థులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకుంటే ఉద్యోగం పొందడం సులువు అవుతుందన్నారు. డైరెక్టర్ సుబ్బరాజు, కళాశాలల ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్ రెడ్డి, జనార్దన్‌రాజు, వైస్ ప్రిన్సిపల్ గోపీనాథ్, హెచ్ఓడీ గీతావాణి, రాజకుమార్, వర్క్‌షాప్ కోఆర్డినేటర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూల్ రేంజ్ డీఐజీని కలిసిన ఇన్‌స్పెక్టర్లు



డీఐజీ సెంథిల్‌కుమార్‌తో పోలీసు అధికారులు

చిత్తూరు అర్బన్ : జిల్లాలో ఎస్ఐలుగా పనిచేస్తూ ఇటీవల సీఐలుగా ఉద్యోగోన్నతి పొందిన పలువురు అధికారులు శనివారం కర్నూలు రేంజ్ డీఐజీ సెంథిల్ కుమార్‌ను కలిసి రిపోర్టు చేశారు. చిత్తూరు క్రైమ్ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఉమామహేశ్వరరావు, టూటౌన్ లో విధులు నిర్వర్తిస్తున్న నాగరాజు, వి.కోటలో పనిచేస్తున్న మనోహర్ తదితరులు డీఐజీని మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపటి నుంచి ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్



జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పేదలకిచ్చిన ఇంటి పట్టాలకు సోమవారం నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ మేరకు పకడ్బందీగా కసరత్తు పూర్తి చేసినట్లు వెల్లడించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ పూర్తి చేసి అర్హులకు కన్వేనియన్స్ డీడ్స్ ఇవ్వనున్నట్లు వివరించారు. ఇందుకోసం పంచాయతీ కార్యదర్శులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా గుర్తించినట్లు తెలిపారు. ప్రభుత్వం తరపున జిల్లాలోని అన్ని గ్రామాల్లో వీఆర్‌ఓలు రిజిస్ట్రేషన్లు చేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించారని వివరించారు.

పది మంది ఎస్ఐల బదిలీ

చిత్తూరు అర్బన్: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పనిచేస్తున్న పదిమంది ఎస్ఐలను అనంతపురం రేంజ్‌కు బదిలీ చేస్తూ డీఐజీ అమ్మిరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు జిల్లా నుంచి జీడీవీ రమణ, డి.సురేంద్రబాబు, కె.పద్మావతి, కె.సుగుణ, ఎం.దసరాజ నాయక్, తిరుపతి జిల్లా నుంచి ఎం.శ్రీనివాసులు, సి.చలపతి, ఎస్.గిరిబాబు, ఎంఎం.వెంకటేశ్వర్లు, ఎస్‌జీ హేమాద్రిని బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.